APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ శనివారం 18, జూలై 2026 సంపుటి: 01 సంచిక :51 పేజీలు : 04 వెల: 2-00/-



## అటవీ అధికారులకు రాష్ట్రపతి సూచనలు

- ద్రౌపది ముర్ము కీలక సందేశం
- పర్యావరణం-ప్రజల మధ్య సమతుల్యతపై దృష్టి

న్యూఢిల్లీ, జూలై 17 : భారత అటవీ సేవకు చెందిన శిక్షణాధికారులు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అటవీ పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, ప్రజల భాగస్వామ్యంపై రాష్ట్రపతి వారికి పలు కీలక సూచనలు చేశారు. అడవులు, జీవవైవిధ్యాన్ని కాపాడే క్రమంలో అడవుల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజల న్యాయమైన అవసరాలు, ఆకాంక్షలను కూడా సమానంగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అటవీ సంపదను పరిరక్షించే చర్యలు ప్రజల జీవనోపాధికి భంగం కలిగించకుండా ఉండాలని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణతో పాటు స్థానిక ప్రజల సంక్షేమాన్ని సమన్వయం చేయడం ద్వారానే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె అన్నారు. అటవీ పరిరక్షణలో ప్రజల విశ్వాసాన్ని పొందడం అత్యంత ముఖ్యమని సూచించారు. అటవీ సంరక్షణ, అడవుల పునరుద్ధరణ, స్థిరమైన జీవనోపాధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించాలని శిక్షణాధికారులకు రాష్ట్రపతి సూచించారు. స్థానిక సమాజాలు భాగస్వాములుగా మారితే పరిరక్షణ చర్యలు మరింత విజయవంతమవుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రజల సహకారంతో చేపట్టే కార్యక్రమాలు దీర్ఘకాలిక ఫలితాలను ఇస్తాయని చెప్పారు. శాస్త్రీయ ఆధారాలతో పాటు ప్రజల అనుభవం, స్థానిక పరిజ్ఞానం, వారితో జరిగే సంభాషణల ద్వారా లభించే అవగాహనను కూడా నిర్ణయాల ప్రక్రియలో భాగం చేయాలని రాష్ట్రపతి సూచించారు.

## కేంద్ర మంత్రికి సీఎం స్వాగతం

- సీఎం చంద్రబాబుతో కలిసి నరసరావుపేటకు రాక
- కేంద్ర మంత్రికి జిల్లా నేతల ఆహ్వానం



నరసరావుపేట, జూలై 17 : పల్నాడు జిల్లా నరసరావుపేటకు చేరుకున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘన స్వాగతం పలికారు. జిల్లాకు చేరుకున్న కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి ఆత్మీయంగా ఆహ్వానించగా, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం తెలిపారు. కేంద్ర మంత్రి పర్యటన సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నరసరావుపేటకు వచ్చిన కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులను కేంద్ర మంత్రికి పరిచయం చేశారు. కార్యక్రమాలు విజయవంతంగా జరిగేలా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఈ పర్యటన సందర్భంగా చర్చలు జరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. భద్రతా ఏర్పాట్లతో పాటు కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నరసరావుపేటలో కేంద్ర మంత్రి రాకతో రాజకీయ, పరిపాలనా వర్గాల్లో సందడి నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున హాజరై కేంద్ర మంత్రికి స్వాగతం పలికారు. కార్యక్రమ ప్రాంగణంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది. పర్యటన సందర్భంగా జిల్లాలో నిర్వహించనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను కూడా అధికారులు సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస-్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి



## సాగులో ఉన్న రైతులకు న్యాయం చేయాలి..

వెన్‌పీ కుంట మండలంలో ఎన్నో ఏళ్లుగా సాగులో ఉన్న అర్హులైన రైతులకు వెంటనే భూ పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ, రైతు రక్షణ సమితి అధ్యక్షుడు యాదల్ల రాజేష్ ఆధ్వర్యంలో నేడు ఎదురుదోన మరియు మేకలచెరవు పంచాయతీలలో ప్రచార రథంతో రైతు రక్షణ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని రైతులు, ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకుని, భూ పట్టాల కోసం జరుగుతున్న ఉద్యమానికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ యాత్రలో పలువురు రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ, "కాళ్లకు ఉన్న చెప్పులు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా, ఇప్పటికీ మాకు న్యాయం జరగలేదు" అని వాపోయారని తెలిపారు. ఈ సందర్భంగా యాదల్ల రాజేష్ మాట్లాడుతూ, దశాబ్దాలుగా సాగు చేస్తున్న అర్హులైన రైతులకు వెంటనే భూ పట్టాలు ఇవ్వాలని, రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం



- మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు
- డిజిటల్ రేడియాలజీ సేవలపై సమీక్ష

అమరావతి, జూలై 17 : రాష్ట్రంలో అనవసర సిజేరియన్ ప్రసవాలను తగ్గించి సాధారణ ప్రసవాలను ప్రోత్సహించే దిశగా మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో సిజేరియన్ ప్రసవాల నియంత్రణ, సి-సేఫ్ కార్యక్రమం అమలు, మిడ్‌వైఫరీ సేవల విస్తరణ, రేడియాలజీ నిర్ధారణ సేవల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు సురక్షిత మాతృత్వాన్ని ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా తీసుకుని పనిచేయాలని సూచించారు. వైద్యపరంగా అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ ప్రసవాలు నిర్వహించేలా ఆసుపత్రుల్లో పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. సాధారణ ప్రసవాల వల్ల తల్లి, శిశువుకు కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు .సి-సేఫ్ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, మిడ్‌వైఫరీ సేవలను గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించాలని మంత్రి పేర్కొన్నారు. గర్భిణులకు గర్భధారణ దశ నుంచి ప్రసవానంతర సంరక్షణ వరకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తల్లి, శిశు మరణాలను మరింత తగ్గించేందుకు ప్రతి వైద్య సంస్థ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్న 33 సీటీ స్కాన్, 21 ఎంఆర్ఐ, 243 ఎక్స్‌రే టెలి-రిపోర్టింగ్ కేంద్రాల పనితీరును సమావేశంలో సమీక్షించారు. ఈ సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు వేగంగా వైద్య నిర్ధారణ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రేడియాలజీ సేవల నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ అన్ని కేంద్రాల్లో ఒకే విధమైన ప్రమాణాలు పాటించేలా చూడాలని సూచించారు. రేడియాలజీ సేవలను డిజిటల్ అపాయింట్‌మెంట్ విధానం ద్వారా మరింత పారదర్శకంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిర్ధారణ పరీక్షల కోసం రోగులు ఎక్కువసేపు నిరీక్షించాల్సిన పరిస్థితి లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. సేవల వేగం, నాణ్యత, పారదర్శకత పెరిగేలా అన్ని జిల్లాల్లో సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖలోని అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. మాతా శిశు ఆరోగ్య పరిరక్షణ, ఆధునిక నిర్ధారణ సేవల విస్తరణ, ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సమావేశంలో వెల్లడించారు.



## అమరావతి రహదారి పనుల పరిశీలన

- మంత్రి పొంగూరు నారాయణ సమీక్ష
- త్వరగా పూర్తి చేయాలని ఆదేశం

అమరావతి, జూలై 17 : రాజధాని అమరావతిలో సీడ్ యాక్సిస్ రోడ్డును పాత గుంటూరు జాతీయ రహదారితో అనుసంధానించే పనులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ శుక్రవారం పరిశీలించారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించిన మంత్రి అధికారులతో చర్చించి నిర్మాణాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ రహదారి పూర్తయితే విజయవాడ, మంగళగిరి నుంచి అమరావతికి నేరుగా, సులభంగా రాకపోకలు సాగించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. సీడ్ యాక్సిస్ రోడ్డుకు అనుసంధానంగా బకింగ్‌హామ్ కాలువ, కొండవీటి వాగుపై నిర్మిస్తున్న రెండు ఉక్కు వంతెనల పనులు తుది దశకు చేరుకున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. నిర్మాణ నాణ్యతతో పాటు మిగిలిన పనులను కూడా మంత్రి పరిశీలించి వేగవంతం చేయాలని సూచించారు. వంతెనలు పూర్తయ్యే సమయానికే రహదారి పనులు కూడా పూర్తి కావాలని ఆదేశించారు. రహదారి, వంతెనల నిర్మాణం ఒకేసారి పూర్తయితే ప్రజలకు మొత్తం మార్గాన్ని ఒకేసారి అందుబాటులోకి తీసుకురావచ్చని మంత్రి పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో ఆలస్యం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. అవసరమైన వనరులు, యంత్ర సామగ్రిని పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. ఈ కీలక మార్గం అందుబాటులోకి వస్తే రాజధాని అమరావతికి రాకపోకలు మరింత సులభతరం అవుతాయని మంత్రి అన్నారు. విజయవాడ, మంగళగిరి ప్రాంతాల నుంచి రాజధానికి నేరుగా చేరుకునే సౌకర్యం కలగడంతో ప్రజలకు సమయం, ప్రయాణ వ్యయం రెండూ తగ్గుతాయని వివరించారు. రాజధాని అభివృద్ధిలో ఈ మార్గం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అమరావతిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. రహదారులు, వంతెనలు, ఇతర నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

అనంత సూర్య
తెలుగువార్త

శనివారం 18 జూలై 2026

# మదరస రబ్బానియా విద్యార్థులకు బ్యాగులు వితరణ







స్థానిక కాలేజీ రోడ్డు జెండామాను వీధిలో గల మదరస రబ్బానియా విద్యార్థినీ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందచేశారు. ఈ కార్యక్రమం లో మదరస కార్యదర్శి హాజీ అత్తార్ మహబూబ్ బాషా, అధ్యక్షులు హాజీ జాఫర్ సాదిక్, కోశాధికారి పి. అజీం ఖాన్, ఉప కార్యదర్శి అన్వర్ బాషా, హాఫీజ్ అహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు. మదరస కార్యదర్శి హాజీ అత్తార్ మహబూబ్ బాషా మాట్లాడుతూ మదరస విద్యార్థినీ విద్యార్థులు క్రమశిక్షణ తో సోదరీ, సోదరుల భావంతో, ఇతరుల పట్ల గౌరవ ప్రవర్తన కలిగి వుండాలన్నారు. "ఇస్లాం" ప్రేమకు, శాంతికి ప్రతిరూపమని, ఇతరులకు కష్టం కలిగించకూడదని నేర్పుతుందని అన్నారు.

# పుట్టపర్తి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి విస్తృత పర్యటన





- బాధిత కుటుంబాలకు పరామర్శ, ధైర్యం చెప్పిన మాజీ ఎమ్మెల్యే
- మహమ్మాదాబాద్ క్రాస్‌లో 'జగన్ 2.0' యాప్ ప్రారంభం

కొత్తచెరువు, జూలై 17 (అనంత సూర్య): పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి శుక్రవారం ఓడీ చెరువు, బుక్కపట్నం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించడంతో పాటు ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్తలు, అభిమానుల కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఓడీ చెరువు మండలంలోని టీ.కుంట్లపల్లి, నందివారిపల్లి, బసప్పగారిపల్లి, ఎగువ చెర్లోపల్లి, చల్లావారిపల్లి, శెట్టిపల్లి, బండకిందపల్లి గ్రామాల్లో అనారోగ్యంతో ఉన్నవారిని పరామర్శించి, మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామంలో మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి కుమారుడు రెడ్డెప్పరెడ్డి మృతికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అదే గ్రామానికి చెందిన నరసింహులు (ఠాగూర్) ఆరోగ్య పరిస్థితిని కూడా అడిగి తెలుసుకున్నారు. మహమ్మాదాబాద్ క్రాస్‌లో 'జగన్ 2.0' యాప్ ప్రారంభం ,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన డిజిటల్ క్యాంపెయిన్‌లో భాగంగా ఓడీ చెరువు మండలం మహమ్మాదాబాద్ క్రాస్‌లో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి 'జగన్ 2.0' యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి అభిమాని, కార్యకర్త డిజిటల్ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యోగి వేమన విజ్ఞాన యాత్ర-ఏఐ బస్సు ప్రారంభం






- సంస్కృతి పరిరక్షణకు సాంకేతికతను వినియోగించాలి: ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

గాండ్లపెంట, జూలై 17 అనంత సూర్య: గాండ్లపెంట మండలం కటారుపల్లిలోని ప్రజాకవి యోగి వేమన జీవసమాధి పుణ్యక్షేత్రం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన 'యోగి వేమన విజ్ఞాన యాత్ర--ఏఐ విజ్ఞాన్ బస్సు'ను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగి వేమన జీవితం, తత్వం, నీతి బోధనలను నేటి యువత, విద్యార్థులకు చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతతో యోగి వేమన జీవిత విశేషాలు, ఆయన పద్యాల సందేశం, కదిరి ప్రాంతంలోని పుణ్యక్షేత్రాలు, సంస్కృతి, చారిత్రక ప్రాధాన్యాన్ని ప్రజలకు ఆధునిక విధానంలో పరిచయం చేయనున్నట్లు చెప్పారు. ఈ ఏఐ విజ్ఞాన్ బస్సు జ్ఞానం, సంస్కృతి, సాంకేతికతల సమ్మేళనంగా నిలుస్తుందని, కదిరి ప్రాంత పర్యాటక రంగానికి కొత్త గుర్తింపు తీసుకురావడంతో పాటు విద్యార్థుల్లో చరిత్ర, సాహిత్యంపై ఆసక్తిని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. యోగి వేమన పద్యాల్లోని విశ్వమానవ విలువలను ప్రతి తరానికి చేరవేసేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను విజ్ఞాన వ్యాప్తికి, సంస్కృతి పరిరక్షణకు, మహనీయుల ఆలోచనలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు వినియోగించాలని విద్యార్థులకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం చిన్నారులకు గుడ్లు అందించాలి



**15 రోజులుగా గుడ్లు ఇవ్వని అంగన్‌వాడీ సిబ్బందికి షోకాజ్ నోటీసు ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి ఆదేశం**

కూడేరు, జూలై 17 అనంత సూర్య: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం చిన్నారులకు తప్పనిసరిగా కోడిగుడ్లు, పౌష్టికాహారం అందించాలని ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కూడేరు మండలంలోని కడదరకుంట అంగన్‌వాడీ కేంద్రాలు-1, 2లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కడదరకుంట అంగన్‌వాడీ కేంద్రంలో జూలై 3 నుంచి చిన్నారులకు కోడిగుడ్లు అందించడం లేదని గుర్తించి సిబ్బంది పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారుల పోషకాహారం కోసం ప్రభుత్వం అధిక నిధులు వెచ్చిస్తోందని, అలాంటి సమయంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడం సహించబోమన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని ప్రతిరోజూ అందించేలా సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కడదరకుంట అంగన్‌వాడీ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌ను లక్ష్మీరెడ్డి ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో డీఎస్‌వో శోభారాణి, ఐసీడీఎస్ పీడీ సాహిదా బేగం, పౌరసరఫరాల డీఎం రమేష్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజేశ్వరమ్మ, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీమ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య అధికారిగా డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



అనంతపురం, జూలై 17 అనంత సూర్య:అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య అధికారిగా (డీఎంహెచ్ఓ) డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లాలోని అల్లూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై అనంతపురం జిల్లా డీఎంహెచ్ఓగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలోని ప్రజల ఆరోగ్య పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా కార్యాచరణ రూపొందించి నాణ్యమైన వైద్య, ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. ఆరోగ్య సేవలందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అన్నారు. ఐవీఆర్ఎస్‌లో మెరుగైన ఫలితాలు సాధించేలా సేవల నాణ్యతను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, అదే సమయంలో ప్రజలతో సహృదయంతో వ్యవహరిస్తూ ఉత్తమ ఆరోగ్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# మైనర్ బాలికపై లైంగిక దాడి కేసు



**-మైనర్ బాలుడిని జువెనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరు పరిచిన పోలీసులు**

కొత్తచెరువు, జూలై 17 అనంత సూర్య: కొత్తచెరువు పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటనకు సంబంధించి పోలీసులు నిందితుడైన మైనర్ బాలుడిని శుక్రవారం అదుపులోకి తీసుకుని జువెనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొత్తచెరువు గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన మైనర్ బాలికను అదే ప్రాంతానికి చెందిన మైనర్ బాలుడు ఈ నెల 11, 12 తేదీల్లో తన ఇంటికి పిలిపించి లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై బాలిక తల్లి జూలై 14న రాత్రి కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు భారతీయ న్యాయ సంహిత లోని సంబంధిత సెక్షన్లు, అలాగే పోక్సో చట్టంలోని సంబంధిత నిబంధనల కింద క్రైమ్ నెం.66/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సేకరించిన ఆధారాల మేరకు ఇన్‌చార్జి పుట్టపర్తి డీఎస్పీ జె. శివ నారాయణస్వామి పర్యవేక్షణలో శుక్రవారం మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకుని జువెనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం



**బడ్జెట్ కేటాయింపులపై చైర్మన్ వడ్డే వెంకట్ సమీక్ష**

అనంతపురం, జూలై 17 అనంత సూర్య: ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలోని గ్రంథాలయాల అభివృద్ధి, రానున్న ఆర్థిక సంవత్సర బడ్జెట్ కేటాయింపులపై జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, గ్రంథాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ వడ్డే వెంకట్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను పాఠకులు, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి అవసరమైన బడ్జెట్ అంచనాలు, నిధుల కేటాయింపులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో తాగునీరు, విద్యుత్, డిజిటల్ లైబ్రరీల వంటి మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం తాజా స్టడీ మెటీరియల్, పత్రికలు, విలువైన పుస్తకాల కొనుగోలుకు నిధులు కేటాయించాలని నిర్ణయించారు. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు సిబ్బంది మరింత మెరుగైన సేవలు అందించాలని, బడ్జెట్ నిధులను పారదర్శకంగా వినియోగిస్తూ దుర్వినియోగానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



కదిరి, జూలై 17 అనంత సూర్య: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి సత్వర పరిష్కారం చూపడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. గాండ్లపెంట మండలం కటారుపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణం, పెన్షన్లు, భోగతమ్మ ఆలయం వద్ద త్రీ-ఫేజ్ విద్యుత్ సౌకర్యం, మసీదుకు ప్రహరీ గోడ నిర్మాణం, భూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వినతులను పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి సాధ్యమైన సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించారు. మిగిలిన దీర్ఘకాలిక సమస్యలను కూడా ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడం, ప్రతి కుటుంబానికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రతి సమస్య పరిష్కారమయ్యే వరకు తన కృషి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలి



**'ఒక నెల--ఒక నియోజకవర్గం--నాలుగు సందర్శనలు' కార్యక్రమంలో కలెక్టర్ ఓ. ఆనంద్**

అనంతపురం, జూలై 17 అనంత సూర్య: ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు.కూడేరు మండలం ఉదిరిపికొండ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 'ఒక నెల--ఒక నియోజకవర్గం--నాలుగు సందర్శనలు' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 187 అర్జీలు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరుసగా నాలుగు వారాల పాటు ఒకే గ్రామాన్ని సందర్శిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెన్షన్లు, ఉపాధి హామీ, గృహనిర్మాణం, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్యంతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించలేని సమస్యల విషయంలో కారణాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా ప్రతి గురువారం తహసీల్దార్లు తమ మండలంలోని ఒక గ్రామాన్ని సందర్శిస్తూ వరుసగా నాలుగు వారాలు అక్కడే ప్రజల సమస్యలను పరిశీలించే విధంగా కార్యక్రమం అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అనంతపురం ఇన్‌చార్జి ఆర్డీవో రామ్మోహన్, తహసీల్దార్ మోహన్ కుమార్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# 49వ సారి రక్తదానం



అనంతపురం, జులై 17 అనంత సూర్య : మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో అనంతపురంలోని కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రిలో గౌస్ మొద్దిన్ అనే పేషెంట్ కు అత్యవసరంగా బి పాజిటివ్ సింగిల్ డోనర్ ప్లేట్లెట్స్ కావాకంటే 49వ సారి అనంత ఆసరా సంస్థ వ్యవస్థాపకులు శేషాద్రి రక్తదానం చేశారు.

# అనంతపురం పోలీసులకు రూ.10 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లు అందజేత



**ఫోర్టినెట్ సంస్థకు ఎస్పీ పి. జగదీష్ కృతజ్ఞతలు**

అనంతపురం, జూలై 17 అనంత సూర్య: ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సంస్థ ఫోర్టినెట్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లా పోలీసులకు రూ.10 లక్షల విలువైన 20 అత్యాధునిక ల్యాప్‌టాప్‌లను అందజేసింది.స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఫోర్టినెట్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్, ఏజీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎ.జి. అనిల్ కుమార్ కలిసి జిల్లా ఎస్పీ పి. జగదీష్,కు ల్యాప్‌టాప్‌లను అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ ఫోర్టినెట్ సంస్థ అందించిన సహకారం పోలీసు శాఖకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ ల్యాప్‌టాప్‌లు రక్షక్ స్కూల్‌లో డిజిటల్ విద్యా సదుపాయాల మెరుగుదలకు, జిల్లా పోలీసుల సైబర్ క్రైమ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను బలోపేతం చేయడానికి దోహదపడతాయని తెలిపారు. ఆధునిక సాంకేతికతతో సైబర్ నేరాల నియంత్రణలో పోలీసుల సామర్థ్యం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.ఫోర్టినెట్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్ మాట్లాడుతూ సమాజంలో సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించడం, పోలీసు వ్యవస్థను డిజిటల్‌గా మరింత బలోపేతం చేయడం తమ సంస్థ లక్ష్యమన్నారు. మరో రూ.40 లక్షల విలువైన హైఎండ్ ల్యాప్‌టాప్‌లను పది రోజుల్లో అనంతపురం జిల్లా పోలీసులకు అందజేయనున్నట్లు ప్రకటించారు.ఈ సీఎస్ఆర్ కార్యక్రమానికి సహకరించిన ఫోర్టినెట్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్‌తో పాటు, కార్యక్రమ సమన్వయానికి కృషి చేసిన ఏజీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎ.జి. అనిల్ కుమార్‌ను ఎస్పీ శాలువాతో సన్మానించి అభినందించారు.కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ వ్యవస్థలు సమన్వయంతో పనిచేస్తే సమాజానికి మరింత మెరుగైన సేవలు అందించవచ్చని ఎస్పీ అభిప్రాయపడ్డారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని విధురాశ్వత్థ ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం





అనంతపురం, జులై 17 అనంత సూర్య : జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని, ఆయనకు జరిగిన శస్త్రచికిత్స విజయవంతమై పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజా సేవలోకి రావాలని కాంక్షిస్తూ విధురాశ్వత్థ పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ అధ్యక్షులు టీసీ వరుణ్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దాదాపు 5 వేల సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన అత్యంత ప్రసిద్ధి పొందిన గౌరీబిదనూరు తాలూకాలోని విధురాశ్వత్థ క్షేత్రంలో వెలసిన శ్రీ లక్ష్మీ సమేత అశ్వత్థ నారాయణస్వామి ఆలయంలో జనసేన నాయకులు ప్రత్యేక పూజలు, స్వామివారికి పాలాభిషేకం నిర్వహించారు. పవన్ కళ్యాణ్ పేరిట అర్చనలు జరిపించి, ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు చేకూరాలని మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు, పేదలకు భారీగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంట్ అబ్జర్వర్ కమిటీ సభ్యులు, నగర కార్యదర్శి విశ్వనాథ్ (3వ రోడ్డు), జనసేన పార్టీ సీనియర్ నాయకులు విజయ్ భాస్కర్ రాయల్, షణ్ముఖ రాయల్, టీడీపీ యువ నాయకులు మోటుపల్లి రామ్మోహన్ నాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో తొలి వసతి గృహం మనమే పూర్తి చేశాం

**- విద్య, భోజనం, భవనాలు అన్నింటా నాణ్యతే.. నారా లోకేష్ లక్ష్యం**

**- ఆత్మకూరు జూనియర్ కళాశాల భవనాల ప్రారంభోత్సవంలో పరిటాల సునీత**

**- పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత**

**- పాఠశాలల్లో రాజకీయాలకు తావు లేదన్న ఎమ్మెల్యే సునీత**

**- ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం**






అనంతపురం, జులై 17 అనంత సూర్య : ఉమ్మడి జిల్లాలో తొలి వసతి గృహాన్ని మనమే పూర్తి చేశామని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాల భవనాలను ఆమె ప్రారంభించారు. దీంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. టపాసులు కాలుస్తూ, పూల వర్షం కురిపిస్తూ అభిమానం చాటుకున్నారు. ముందుగా ఆత్మకూరు మండల కేంద్రంలో 56 లక్షల ఎన్.హెచ్.ఎం నిధులతో నిర్మించబోవు పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఆమె కస్తూరిబా జూనియర్ కళాశాలకు వెళ్లగా.. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే సునీతకు ఆత్మీయ స్వాగతం పలికారు. అక్కడ 2కోట్ల 12లక్షల రూపాయల ఏ.డబ్ల్యూ.పీ నిధులతో నిర్మించిన భవనాలను ప్రారంభించారు. కళాశాల నూతన భవనాలను పరిశీలిస్తూ.. అక్కడున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం భోజనశాలను సందర్శించి భోజనం రుచి, నాణ్యతను చూశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల వసతి గృహాల నిర్మాణం జరుగుతున్నప్పటికీ ముందుగా పూర్తి చేసింది మాత్రం మనమేనన్నారు. ఆత్మకూరులో ప్రారంభమైన వసతి గృహం.. కూటమి ప్రభుత్వంలో తొలి భవనంగా నిలిచిందన్నారు. విద్యాసంస్థల్లో ఏ పని జరిగినా నాణ్యతగా ఉండాలన్నదే మంత్రి నారా లోకేష్ లక్ష్యం అన్నారు. విద్య అయినా, భవనాలైనా, భోజనమైనా ఏదైనా సరే క్వాలిటీ ముఖ్యమన్నారు. పిల్లలు ఇబ్బంది పడకూడదని సోలార్ హీటర్స్ కూడా పెట్టించారన్నారు. దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని.. దీనిని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణగా ఉండాలని సూచించారు. జూనియర్ కళాశాల వయసులో పిల్లల మనసు పక్కదారి పట్టించే అవకాశాలు ఉంటాయని.. ఇలాంటి వాటి పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మరోవైపు పాఠశాలలో రాజకీయాలకు తావు లేదని.. ఎవరైనా సరే ఇక్కడ రాజకీయ కార్యక్రమాలు, ప్రసంగాలు ఉండకూడదన్నారు. గతంలో జగన్ రెడ్డి పిల్లలకు అందించే పుస్తకాలు, బ్యాగులు, చివరకు తిండి పదార్థాల మీద కూడా తన పేరు, ఫోటోలు వేయించుకున్నారన్నారు. మంత్రి లోకేష్ వీటికి స్వస్తి పలికి సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయుల ఫోటోలతో వాటిని పంపిణీ చేస్తున్నారన్నారు. 22వ తేదీ నుంచి డోనర్ యాప్ ద్వారా పూర్వ విద్యార్థులు, ప్రముఖులు, రాజకీయ నేతల నుంచి పాఠశాల అభివృద్ధికి విరాళాల సేకరణ చేపట్టినట్టు తెలిపారు. పాఠశాలకు సాయం చేస్తే.. ఐటీ మినహాయింపు కూడా ఉంటుందన్నారు. ఆత్మకూరు మండలలో ఈ రెండేళ్లలోనే సుమారుగా 60 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని.. ఇందులో రోడ్లు, పలు భవనాలు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం ఉందన్నారు. ముఖ్యంగా 3కోట్ల 27లక్షలతో మదిగుబ్బ - పి.కొత్తపల్లి రోడ్డు, 2కోట్ల 19లక్షలతో ఆత్మకూరు--కురాకులపల్లి రోడ్డు, 35 కోట్లతో తాగునీటి కొరకు సీపీడబ్ల్యూఎస్ పథకం కింద పనులు, 6కోట్ల 60లక్షలతో గొరిదిండ్ల, తోపుదుర్తి 33/11 ఖం సబ్ స్టేషన్లు నిర్మాణం చేసినట్టు వివరించారు...

ప్రజా సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే సునీత ఫోకస్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే పరిటాల సునీత ముందుకు సాగుతున్నారు. ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను ఓపిగ్గా వింటూ .. కొన్నింటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో ప్రధానంగా రెవెన్యూ, పింఛన్లు, కమ్యూనిటీ భవనాలు, గ్రామ పంచాయతీలకు సంబంధించినవి ఉన్నాయి. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీకి కచ్చితమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ విషయాల మీద బాధితులకు స్పష్టతనివ్వాలన్నారు. ఎవర్నీ పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దని ఎమ్మెల్యే సునీత సూచించారు.

# అనంత పోలీసులకు అత్యాధునిక ల్యాప్ టాప్ లు అందజేత

## – త్వరలో మరో రూ.20 లక్షల విలువైన ల్యాప్ టాప్ లు : ఫోర్టినెట్ ఎండీ కిషోర్



అనంతపురం, జులై 17 అనంత సూర్య : ప్రపంచంలో అగ్రగామి సైబర్ సెక్యూరిటీ సంస్థ అయిన ఫోర్టినెట్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లా పోలీసులకు రూ.10 లక్షల విలువైన 20 అత్యాధునిక ల్యాప్‌టాప్‌లను విరాళంగా అందించింది. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఫోర్టినెట్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్, ఏజీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఏజీ అనిల్ కుమార్‌తో కలిసి ఈ ల్యాప్‌టాప్‌లను జిల్లా ఎస్పీ పి.జగదీష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఫోర్టినెట్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్ మాట్లాడుతూ.. సమాజంలో సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించేందుకు, ముఖ్యంగా పోలీసు వ్యవస్థను డిజిటల్‌గా మరింత బలోపేతం చేయడానికి తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. అనంతపురం జిల్లా పోలీసులకు మరో రూ.40 లక్షల విలువైన హైఎండ్ ల్యాప్‌టాప్‌లను పది రోజుల్లో అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ ల్యాప్‌టాప్‌లు రక్షక్ స్కూల్లో డిజిటల్ విద్యా సదు-పాయాలను మెరుగుపరచడంతో పాటు, జిల్లా పోలీసుల సైబర్ క్రైమ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి సైబర్ నేరాల నియంత్రణలో అనంతపురం పోలీసులు మరింత సమర్థవంతంగా పనిచేయడానికి ఈ సహకారం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ.. ఫోర్టినెట్ సంస్థ అందించిన ఈ ఉదార సహకారం పోలీసు శాఖకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రక్షక్ స్కూల్‌తో పాటు సైబర్ క్రైమ్ విభాగం సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఈ పరికరాలు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఫోర్టినెట్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్ కు, అలాగే ఈ సీఎసఆర్ కార్యక్రమాన్ని అనంతపురం పోలీసులకు అందేలా సమన్వయం చేసిన ఏజీఎస్ ఫౌండేషన్ ఏజీ అనిల్ కుమార్ కు ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ వ్యవస్థలు కలిసి పనిచేస్తే సమాజానికి మరింత మెరుగైన సేవలు అందించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.




## అనంతలో వైజాగ్ వారి విద్యాదోపిడీ !
# ట్రెల్లీస్ మాయలు

- నో సీబీఎస్ఈ.. జనగణమన స్థానంలో సర్వమత ప్రార్థనలు ?
- 'నో రిటర్న్' అడ్మిషన్ ఫీజు రూ.15,000
- పాఠ్యపుస్తకాలా.. జ్యోతి బుక్‌స్టాల్‌కు ఫోన్ పే..
- హద్దులు దాటిన పుస్తక విక్రయాల అక్రమ దోపిడీ
- అన్నీ చూస్తూ.. మౌనంగా ఉండేందుకు విద్యాశాఖలో బుల్లోడికి బంగారు బహూకరణ ?
- ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన బాట పట్టిన విద్యార్థి సంఘాలు



**అనంతపురం, జులై 17 అనంత సూర్య :**

ఏమి తెలివి.. ఏమి తెలివి.. అనంతపురంలో ఓ వైజాగ్ వారి వక్ర తెలివి అదుర్స్. ఇద్దరు మిత్రులు కలిసి విద్యను వ్యాపారంగా మార్చేసి అక్రమ సంపాదనే లక్ష్యంగా ఓ విద్యా సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఆ విద్యా సంస్థ దోపిడీకి, పొంతన లేని నిబంధనల వికృత చేష్టలకు భజన చేసేలా విద్యాధికారులు వంత పాడేందుకు బుల్లోడుకి బంగారు బహుకరణ మొదలు.. రాజకీయంగా అండదండలు ఉండేలా ముఖ్యనేతల వద్ద ఉన్న అనుచరుల ఆశీస్సులతో ఎక్కడా లేనివిధంగా సెమీ రెసిడెన్షియల్ పేరుతో జరుగుతున్న దోపిడీ అనిర్వచనీయం. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం.. పత్రికా బృందం లోతైన విచారణలోను ఎన్నో విషయాల ఆ విద్యాసంస్థకు సంబంధించినవి వెలుగులోకి వస్తున్నాయి.

**హద్దు అదుపులేని ఫీజుల దోపిడీ :**

పాఠశాలలోకి ప్రవేశించగానే అది ఏ తరగతి అయినా సరే, అడ్మిషన్ ఫీజు రూ.15వేలు. ఇక పాఠశాల ఫీజు లక్ష పైమాటే. సెంట్రల్ బేస్ సిలబస్ కాదు అయినా.. జనగణమన, వందేమా తరం సరిపోదని సర్వ మతాలతో కూడిన ప్రార్ధనలకు ఇక్కడ బీజం వేస్తున్నారట? రాష్ట్రంలోనే ఎక్కడ లేని విధంగా వెరైటీగా వారికి ఇష్టం వచ్చినట్లు సెమీ రెసిడెన్షియల్ పేరుతో వీరికి అనుమతి ఎవరు ఇచ్చారో కానీ, ఓ రకమైన భోజనం వడ్డిస్తూ అక్కడ కూడా దోపిడీ పర్వం సాగుతోంది. ఇక పుస్తకాల విషయానికి వస్తే.. పాఠశాలలో ఓ ఆరు పుస్తకాలు పిల్లవాడికి చేతికిచ్చి రూ.8 వేలు పైగానే వసూలట. ఇది సరిపోని పాఠ్యపుస్తకాల పేరుతో మరో రూ.2500 కూడా.. ఇవన్నీ కాక మరికొన్ని పుస్తకాల పేరుతో, విద్యా సామాగ్రి పేరుతో ఇష్టం వచ్చినట్లుగా అక్రమ వసూళ్లకు పాల్పడుతూ ఉండడం విశేషం.

**పాతబడిన రెసిడెన్షియల్ భవంతిలో కమర్షియల్ యవ్వరాలు :**

అనంత నగరంలోని అప్పటి పాత రవీంద్ర భారతి రెసిడెన్షియల్ భవన భవంతిని మన ట్రెల్లిస్ బళ్లారి రోడ్డు సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న పాఠశాలతోపాటు మరో పాఠశాల నిర్వహిస్తుంది అదే పాత రవీంద్ర భారతి పాఠశాల ఉన్నచోట. ఈ భవంతి నగరపాలక సంస్థ నుండి రెసిడెన్షియల్ అనుమతి తీసుకుంది. అయితే కమర్షియల్‌గా పాఠశాల నిర్వహిస్తున్నారు. అదేకాదు అక్కడ కమర్షియల్ నిర్వహించకూడదని, అది ప్రమాదం అని కూడా మున్సిపల్ అధికారులు నోటీసు కూడా జారీ చేయడం విశేషం. అయినా అదేమీ పట్టించుకోకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాట మాడేలా ప్రమాదంలోకి పడేసేలా పాఠశాల నిర్వహిస్తూ.. అక్కడ కూడా ఫీజు దోపిడికి భారీస్థాయిలో పాల్పడుతున్నారు.

**జ్యోతి బుక్‌స్టాల్‌కు ట్రెల్లిస్ పాఠశాలకు లింక్ ఏంటి?**

దొంగ ఎప్పటికీ దొంగే.. దొరకలేదు. అందరూ సహకరిస్తున్నారని.. తామే దొర లని భావిస్తే ఎలా, అసలు ట్రెల్లీస్ విద్యా సంస్థలో విద్యార్థులకు పుస్తకాలు చేతికిచ్చి క్లాక్ టవర్ సమీపంలో ఉన్న జ్యోతి బుక్ స్టాల్‌కు ఫోన్ పే చేయించడం ఏంటి, అసలు ఆ లింక్ ఏంటి ? అది కూడా నాలుగు పుస్తకాలో ఆరు పుస్తకాలో చేతికిచ్చి రూ.వేలల్లో ఫోన్ పే చేయించుకోవడం ఏంటి? ఈ విషయం విద్యాధికారులకు తెలియదనుకుంటే మీరు పొరపడినట్లే. ఆ శాఖలో ఉన్న ఓ బంగారు బుల్లోడికి ఇవ్వాల్సిన ఆ బంగారు కానుక ఇస్తే చాలట.. ఏదైనా తప్పు కూడా ఒప్పు అయిపోతుందని అక్కడ నానుడి. అందుకేనేమో ప్రస్తుతం జిల్లా కలెక్టర్ స్పందించాలని విద్యార్థి సంఘాలు ఆందోళనబాట కూడా పట్టాయని తెలుస్తుంది.




**తక్షణం సీజ్ చేయాల్సిందే ! - ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నేతలు డిమాండ్**



విద్యా నిబంధనలు ఉల్లంఘించి విచ్చల విడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ట్రెల్లీస్ పాఠశాలను తక్షణం సీజ్ చేయాలని, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అక్రమంగా వసూలు చేసిన మొత్తాలను తిరిగి ఇప్పించాలని, జ్యోతి బుక్‌స్టాల్ యాజమాన్యానికి సంబంధించిన బ్యాంకు లావాదేవీలు ఫోన్ పే ట్రాన్సాక్షన్స్‌పై విచారణ జరిపించాలని, సెమీ రెసిడెన్షియల్ అనుమతి ఎవరు ఇచ్చారో కూడా స్పష్టం చేయాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నేతలు డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ధర్నాలో ఏపీ స్టూడెంట్స్ జేఏసీ అధ్యక్షుడు అమర్ యాదవ్ నేతృత్వంలో విద్యార్థి నాయకులు సతీష్ చౌదరి, ప్రకాష్, ఓబుల్ రెడ్డి, నరేష్, విజయ్, రాజేష్ తదితర విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

# జగనన్న 2.0 యాప్‌తో కూటమి కుట్రలను తిప్పికొడదాం



**ప్రతి కార్యకర్త యాప్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**వైయస్ఆర్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబా సలామ్**

అనంతపురం, జులై 17 అనంత సూర్య : వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, కూటమి ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజల ముందుకు వాస్తవాలతో తీసుకెళ్లేందుకు జగనన్న 2.0 యాప్ కీలక వేదికగా నిలుస్తుందని వైయస్ఆర్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబా సలామ్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా పార్టీ కార్యాలయంలో జగనన్న 2.0 యాప్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా షేక్ బాబా సలామ్ మాట్లాడుతూ, ప్రజలకు పార్టీ కార్యక్రమాలు, ఉద్యమాలు, ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని వేగంగా చేరవేయడంలో జగనన్న 2.0 యాప్ ముఖ్యపాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మరింత మందికి చేరవేసి, డిజిటల్ వేదికల ద్వారా ప్రజల్లో వాస్తవాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అనంతపురం నగర మాజీ మేయర్ వసీం సలీమ్ మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలు జగనన్న 2.0 యాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, వైయస్ఆర్‌సీపీ సిద్ధాంతాలు, పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేస్తామని తెలిపారు. జగనన్న 2.0 యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైయస్ఆర్‌సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, బూత్ కన్వీనర్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎద్దుల అమరనాథ్ రెడ్డి, పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కల్లు రమేష్ గౌడ్, సోషల్ మీడియా నగర అధ్యక్షుడు గోళ్ళ శ్రావణ్ కుమార్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, సాకే కుల్లాయి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ ప్రధానం



అనంతపురం : ప్రముఖ జియాలజిస్టు, ఆర్ట్స్ కళాశాల మాజీ అతిథి అధ్యాపకులు డాక్టర్ బండి నారాయణ స్వామికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ మేరకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి అధ్యాపక బృందం ఓ ప్రకటన విడుదల చేశారు. బండి నారాయణ స్వామి తాను ఎంచుకున్న అంశం "రిమోట్ సెన్సింగ్ అండ్ జిఐఎస్ అప్లికేషన్స్ ఇన్ ఎవల్యూషన్ ఆఫ్ డోలమైట్ రిసోర్సెస్ ఇన్ సమ్ పార్ట్స్ ఆఫ్ అనంతపూర్ డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్, ఇండియా" అనే అంశంపై పరిశోధన చేసారు. ఈ అంశం డిపార్ట్మెంట్ ఆఫ్ జియాలజీ ప్రొఫెసర్ టి.మధు ఆధ్వర్యంలో పూర్తి చేయడం జరిగినది. భూగర్భ శాస్త్ర (జియాలజీ) విభాగం నుండి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్.డి) డిగ్రీ పొందేందుకు బండి నారాయణ స్వామి అర్హులని ఉత్తర్వులను డాక్టర్ బి.రాజమాణిక్యం పరీక్షల నియంత్రణాధికారి ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. బండి నారాయణ స్వామికి డాక్టరేట్ ప్రధానం పట్ల ఆయన స్నేహితులు, అధ్యాపకులు, విశ్వవిద్యాలయ బృందం హర్షం వ్యక్తం చేశారు. గతంలో అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నందు దశాబ్దం పాటు జియాలజీ విభాగం నందు అధ్యాపకులుగా పనిచేసిన విషయం తెలిసిందే.

# ఒంటరి మహిళలు ధైర్యంగా జీవించాలి: రెడ్స్ డైరెక్టర్ భానుజా

**రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం: సంస్థ సభ్యులు సురేష్**

**గృహహింస, బాల్య వివాహాలపై మహిళలకు అవగాహన**

**మిషన్ వాత్సల్య పథకాన్ని అర్హులు వినియోగించుకోవాలి**






అనంతపురం, జూలై 17 అనంత సూర్య: ఎన్ని కష్టాలు ఎదురైనా ఒంటరి మహిళలు ఆత్మవిశ్వాసంతో జీవించాలని రెడ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ భానుజా పిలుపునిచ్చారు. అనంతపురం రూరల్ మండలం కురుకుంట గ్రామంలోని పుడమిసిరి మైదానంలో శుక్రవారం నిర్వహించిన ఒంటరి మహిళల సమైక్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళల సాధికారత, గృహహింస నిరోధక చట్టం, బాల్య వివాహాల నిషేధం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో రైతు ఆత్మహత్యలతో ఒంటరిగా మిగిలిన మహిళలను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఆదుకునేందుకు కృషి చేస్తున్నామని భానుజా తెలిపారు. గృహహింసకు గురైన మహిళలు వెంటనే 181 మహిళా హెల్ప్‌లైన్, బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాల సమాచారం కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ను సంప్రదించాలని సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అసోసియేషన్ ఫర్ ఇండియాస్ డెవలప్మెంట్ సభ్యుడు సురేష్ మాట్లాడుతూ, రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు జీవనోపాధి కల్పించేందుకు రెడ్స్ సంస్థతో కలిసి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఒంటరి మహిళలకు ఆవులు అందజేసి పాల ఉత్పత్తి ద్వారా స్థిరమైన ఆదాయం పొందేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి నర్మదా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకం ద్వారా అనాథలు, తల్లిదండ్రుల్లో ఒకరిని లేదా ఇద్దరినీ కోల్పోయిన చిన్నారులకు ఆర్థిక, విద్యా సహాయం అందుతోందని తెలిపారు. అర్హులైన కుటుంబాలు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అధికారులు, రెడ్స్ సంస్థ ప్రతినిధులు, సంఘసంస్కర్తలు, ఒంటరి మహిళలు పాల్గొన్నారు.

# గణేష్ కూడలి--విద్యాగిరి ఆర్చ్ వరకు ర్యాలీలు, ధర్నాలకు అనుమతి లేదు

**పోలీసు నిబంధనలు పాటించాలి: పుట్టపర్తి టౌన్ సీఐ యువరాజు**

**భారీ వాహనాలు, షేర్ ఆటోలకు ట్రాఫిక్ ఆంక్షలు**




పుట్టపర్తి, జూలై 17 అనంత సూర్య:గణేష్ కూడలి నుంచి విద్యాగిరి ఆర్చ్ వరకు ఎలాంటి ర్యాలీలు, ధర్నాలకు అనుమతి లేదని పుట్టపర్తి టౌన్ సీఐ యువరాజు స్పష్టం చేశారు. శుక్రవారం పుట్టపర్తిలో మీడియాతో మాట్లాడుతూ, సత్యసాయి భక్తులు, విద్యార్థులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో ప్రశాంతతకు భంగం కలిగించే కార్యక్రమాలు నిర్వహించరాదని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేయడానికి ఐదుగురికి మాత్రమే పోలీసులు అనుమతి ఇస్తారని చెప్పారు. ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలనుకుంటే ఆర్డీవో కార్యాలయం సమీపంలోని ధర్నా చౌక్‌లో మాత్రమే నిర్వహించాలని సూచించారు. అలాగే గణేష్ కూడలి నుంచి ప్రశాంతి మందిరం మీదుగా సత్యమ్మ కూడలి వరకు భారీ వాహనాలు, షేర్ ఆటోల రాకపోకలకు అనుమతి లేదన్నారు. ఆయా వాహనాలు చిత్రావతి బైపాస్ మీదుగా ప్రయాణించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ కోరారు. మద్యం సేవించి లేదా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405